క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

లింగసముద్రం: మండల పరిధిలోని మాల కొండరాయునిపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేన్ తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఉదయం 7 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు. అలాగే సాయంత్రం 2.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేస్తారన్నారు.

8న గడప గడపకు మన ప్రభుత్వం

హనుమంతునిపాడు: మండల పరిధిలోని కూటాగుండ్ల సచివాలయ పరిధిలోని కూటాగుండ్ల, పాతమల్లవరం, నరవగోపాలపురం, చిన్న మల్లవరం, కొత్త మల్లవరం, ఉడుముల వారిపల్లి గ్రామాల్లో ఈ నెల 8న గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొంటారన్నారు.

నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలి



కొండారెడ్డిపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఎంపీడీఓ జీవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో గృహాలు మంజూరైన లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సిమెంట్, ఇసుక సరఫరా చేస్తుందన్నారు. వెలుగు ఏపీఎం నారాయణ, ఈఓఆర్డీ షరీఫ్, హౌసింగ్ ఏఈ కొండయ్య, సర్పంచ్ కలుకూరి దేవకరుణమ్మ పాల్నొన్నారు.

కమనీయం..కల్యాణం



కరేడులో శ్రీనివాస కల్యాణం

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలోని కోదండరామస్వామి దేవస్థాన ఆవరణలో కల్యాణ వేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణ వేడుక కన్నులపండువగా సాగింది. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి పి.కృష్ణవేణి తెలిపారు. భక్తులు హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

కనిగిరి రూరల్: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన యువకుడు బత్తుల యుగంధర్ (20) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని పాత కూచిపుడిపల్లి చెందిన యుగంధర్ గురువారం రాత్రి మాచవరంలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తుండగా.. మార్గమధ్యంలో డిగ్రీ కాలేజీ దాటిన తర్వాత ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న బత్తుల యుగంధర్ తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతులకు రూ.10 వేల వడ్డీ లేని రుణం

కొండపి: మాండూస్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని పొగాకు రైతులకు రూ.10 వేల వడ్డీ లేని రుణాన్ని పొగాకు బోర్డు అందించనున్నట్లు వేలం కేంద్రం అధికారి ఎస్.రామారావు శుక్రవారం తెలిపారు. వడ్డీ లేని రుణం పొందాలనుకునే రైతులకు సంబంధించి క్లస్టర్ క్షేత్ర సహాయకుడిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతులు తీసుకున్న రుణాన్ని 2023 సీజన్‌లో నిర్వహించే పొగాకు వేలంలో రెండో రౌండ్ పొగాకు అమ్మకాల నుంచి మినహాయించుకుంటామని వేలం కేంద్రం అధికారి తెలిపారు. రుణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 31 చివరి తేదీగా తెలిపారు.

సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు

● ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

వలేటివారిపాలెం: సమస్యలు తెలుసుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయం పరిధిలోని మాలకొండ, రామలింగాపురం గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. అర్హులందరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రచి సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సీఎం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గుడిమెట్ల అంజనేయులు తమకు విద్యాదీవెన అందలేదని ఎమ్మెల్యేకు తెలియపరిచారు. గ్రామానికి చెందిన గుత్తా ఆనంతమ్మ తమకు పీఎం కిసాన్ అందలేదని చెప్పడంతో అక్కడున్న వ్యవసాయ అధికారులను పిలిచి రికార్డులు పరిశీలించి సమస్య పరిష్కరించాలని సూచించారు. మాలకొండయ్య అనే వ్యక్తి మంచినీటి సమస్య ఉందని చెప్పడంతో. సంబంధిత శాఖాధికారిని పిలిచి వెంటనే పరిష్కరించాలన్నారు. యల్లంపల్లి రాజ్యలక్ష్మి అనే మహిళ తన ఇంటి ముందు గత ప్రభుత్వం కరెంట్ స్తంభాలు వేశారని, ఇబ్బందిగా ఉందని తొలగించాలని చెప్పడంతో..ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ శాఖాధికారులను పిలిచి తొలగించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఎంపీడీఓ షేక్ రఫీక్‌అహ్మద్, తహశీల్దార్ సుందరమ్మ, ఏఓ హేమంత్ భరత్‌కుమార్, ఏపీఓ షమీర్‌బాషా, విద్యుత్ శాఖ ఏఈ మధుబాబు, సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గృహ సారథులను నియమించాలి



టంగుటూరులో సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సహకారంతో గృహ సారథులను నియమించాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సూచించారు. టంగుటూరు 1, 2, 3, 4 సచివాలయాల్లో గృహ సారథుల ప్రక్రియను శుక్రవారం ఆయన ప్రారంభించి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ ప్రజలకు సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో మెరుగైన పాలనతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పకుండా అర్హులైన పేద ప్రజలందరికీ సకాలంలో అందుతాయన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే జగనన్న సేవలందిస్తున్నారని అశోక్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, బీసీడి ఉదయకుమార్, వాకా బాలకృష్ణారెడ్డి, సూదనగుంట వెంకటస్వామి, స్టేట్, ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, ఎంపీటీసీలు కొమ్ము ప్రభుదాసు, బొడ్డు వాసంతి, శిఖా నిర్మల, సచివాలయ కన్వీనర్లు కసుకుర్తి శ్రీనివాసరావు, శిఖా దినకర్, దేవరపల్లి అమరావతి, దేపూరి ల్యాబు రమణయ్య, దుగ్గిరాల పేరరాజు, శ్రీను, చక్కా రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహ సారథుల నియామకం

సింగరాయకొండ: మండల కేంద్రంలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఆయా గ్రామ సచివాలయాల వద్ద గృహ సారథుల నియామక కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు



సీఎస్‌పురంలో పింఛన్లు అందజేస్తున్న నేతలు

సీఎస్‌పురం: పార్టీలకతీతంగా అర్హులందరికీ పెన్షన్లు అందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ల పెంపు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్లను పెంచుతున్నారన్నారు. ఆరు నెలల కాలంలో మండలంలో 207 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల చిరంజీవి, మండల అధ్యక్షుడు చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఇతర నేతలు పాల్గొన్నారు.

పామూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక పేదలకు వరం లాంటిదని ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య అన్నారు. మండలంలోని మోపాడుతో పాటు పలు పంచాయతీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పెన్షన్‌లలు లబ్ధిదారులకు వారు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మందిరెడ్డి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పూరేటిపల్లిలో బ్లీచింగ్ చల్లిస్తున్న వైస్ ఎంపీపీ వరలక్ష్మమ్మ

గుడ్లూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని వైద్యాధికారి మారుతీరావు అన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ప్రజాప్రతినిధులతో కలిసి వైద్య, పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో, రోడ్లు పక్కన మురుగునీరు నిల్వలు ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది వివిధ రకాలు వ్యాధులు వస్తాయన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. మురుగు నీరు ఉన్న చోట్ల బ్లీచింగ్ క్లోరినేషన్ చేయించనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కరరావు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

వలేటివారిపాలెం: అర్హులందరికీ ఠంచన్‌గా ఒకటో తేదీనే ఇంటికే పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్ పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో జన్మభూమి కమిటీల సిఫార్సు ఉంటేనే పింఛన్లు అందేవన్నారు. కానీ దళారుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయన్నారు. 2019లో మండలంలో 5,948 పింఛన్లు ఉండగా ఇప్పుడు 6,724 పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత వలంటీర్లకు దక్కుతుందని ఎమ్మెల్యే కొనియాడారు. ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్, తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీపీ మౌనిక, జెడ్పీటీసీ భారతి, ప్రత్యేకాధికారి కనక దుర్గాభవానీ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



పెద్ద డ్రైనేజీ కాలువ శుభ్రం చేయిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 10, 12, 13 వార్డుల్లో శుక్రవారం చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు శ్రీరాం సతీష్, సయ్యద్ రిజ్వాన ఖాలక్, దాసరి మురళీ కృష్ణా లు పర్యటించారు. స్థానికులు పారిశుధ్యం, డ్రైనేజీ కాలువలు, వాటర్ లైన్, వీధి దీపాలు తదితర సమస్యలను చైర్మన్ గఫార్ దృష్టికి తీసుకెళ్లారు. శానటరీ సెక్రటరీలు నాగజ్యోతి, నాగలక్ష్మి, కాశీరాజు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, హెల్త్ సెక్రటరీలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ షాపు, అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ



బైరాగిమాన్యంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తయారవుతున్న వంటలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి

సింగరాయకొండ: మండల కేంద్రంలోని రేషన్‌షాపు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని రేషన్ షాపును తనిఖీ చేసి అంగన్‌వాడీ సెంటర్లకు సకాలంలో రేషన్ సరఫరా చేయాలని, లేకపోతే చిన్నారులకు ఇబ్బంది కలుగుతుందని డీలర్ చెంచయ్యకు సూచించారు. రేషన్ బియ్యం వాహనాల ద్వారా మాత్రమే పంపిణీ జరిగేలా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. భైరాగిమాన్యంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. చిన్నారులకు వండుతున్న కూరలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు కోడిగుడ్లు సక్రమంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ

మద్దిపూడి: రైతులు ఈ ఏడాది సాగుచేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ సూచించారు. మండలంలోని పొట్టిరెడ్డిపాలెం గ్రామంలో సాగుచేసిన బొబ్బర్ల పంటను క్షేత్రస్థాయిలో శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో మండలంలోని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సాగుచేసిన పలు రకాల పంటలను రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులతో ఈ-క్రాపులో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-పంట ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఉన్న భూమి ఆధారంగా రైతుల ల్యాండ్ డేటాను పరిశీలించి ఆ డేటా సరైనదయితేనే అగ్రికల్చర్ అసిస్టెంట్ పంట నమోదు చేస్తారన్నారు. ఈ పంట దరఖాస్తు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ నకళ్లు జత చేసి నిర్ణీత సమయంలో రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు ఇస్తే నమోదు చేస్తారన్నారు. నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే సున్నా వడ్డీలు, ఇన్సూరెన్స్, ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈర్ల చినబాబు, శివశంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

హనుమంతునిపాడు: రబీలో పంటలు సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏడీఏ వెంకటరమణ అన్నారు. మండలంలోని హాజీపురం ఆర్‌బీకేలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడారు. అనంతరం మినుము, రాగి పంటలను, పెసర పంటలు పరిశీలించారు. ఏఓ సంపత్‌కుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ తీరుపై అసంతృప్తి

సీఎస్‌పురం: వైఎస్సార్ పింఛన్ పెంపు సంబరాల్లో ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్ పింఛన్ పంపిణీని పండుగలా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఎంపీడీఓ ప్రజాప్రతినిధులకు సమాచారం లేదు సరికదా సమావేశం కూడా చిన్న రూంలో ఏర్పాటు చేశారు. దీంతో కార్యక్రమానికి వచ్చిన లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. పింఛన్ కోసం వచ్చిన వృద్ధులు కార్యాలయం బైట చెట్లకింద కూర్చోవాల్సి వచ్చింది.

సాదాసీదాగా మండల సమావేశం

కందుకూరు రూరల్: కందుకూరు మండల సర్వసభ్య సమావేశం కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు నివేదికలను వివరించారు. జి.మేకపాడు గ్రామ పరిధిలో సాగు చేసిన కంది పంట మండూస్ తుఫాన్ కారణంగా పూత, పిందె దెబ్బతిని సర్పంచ్ బ్రహ్మయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. 50శాతం పైగా దెబ్బతినే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వ్యవసాయాధికారులు పంటను పరిశీలించి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిపై మండల సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. అదే విధంగా పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు నాడు నేడు-పనులు సక్రమంగా జరగడం లేదని ఎంపీటీసీ పున్నయ్య తెలిపారు. పనులు చేసే వారికి, హెచ్‌ఎం మధ్య విభేదాలు కారణంగా ఇంకా ఆరు లక్షల రూపాయల పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పాఠశాలలో మంచినీటి సమస్యను కూడా పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ పి.విజయశేఖర్, జెడ్పీటీసీ తొట్టెంపూడి అనసూర్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ భవాని హర్ష ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు సక్రమంగా మందుల పంపిణీ జరుగుతుందా.. వైద్య పరీక్షలు సక్రమంగా అందిస్తున్నారా.. ఆస్పత్రిలో తగినన్ని మందుల నిల్వలు ఉన్నాయా అని పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో సిబ్బంది పనితీరును పరిశీలించి వారితో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ భవాని హర్ష మాట్లాడుతూ ఆస్పత్రిలో మందులు, సిబ్బంది కొరత లేదని అన్నారు. ఆస్పత్రి పనితీరు బాగుందని వివరించారు. డాక్టర్ చైతన్య కృష్ణ, డాక్టర్ ఉజ్వలతో మాట్లాడినట్లు తెలిపారు. విజిలెన్స్ సీఐ డీవీవీ సుబ్బారావు, ఎస్సై నాగేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఏఈ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్యమే ధ్యేయం



నీటిలో లార్వాను పరిశీలిస్తున్న మద్దిపూడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

మద్దిపూడి: మండలంలోని 13 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్యమే ధ్యేయంగా పనిచేయాలని మద్దిపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంగీత సిబ్బందికి సూచించారు. మండలంలోని కూచిపూడి గ్రామంలో శుక్రవారం డ్రై డే సందర్భంగా గ్రామంలోని అన్ని వీధుల్లో తిరిగి నీటి తొట్లు, డ్రమ్ముల్లో లార్వాను గుర్తించారు. రెండు రోజులకు మించి తాగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంటిని సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేసుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నర్సమ్మ, ఏడబ్ల్యూ విజయ, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఆషా మాధవి పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.10 వేల విరాళం

కందుకూరు అర్బన్: అంకమ్మతల్లి దేవాలయం పునఃనిర్మాణానికి పట్టణానికి చెందిన జంపాని మాలకొండయ్య ధర్మపత్ని వెంకటరమణ రూ.10వేల విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. అమ్మవారి పాదాల చెంత బంగారు యంత్రం ప్రతిష్ఠకు రెండు గ్రాములు బంగారం రామచంద్రుని మల్లికార్జునరావు, ధర్మపత్ని హేమలత కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే అమిరిశెట్టి వెంకటేశ్వర్లు ధర్మపత్ని సుజాత అమ్మవారి పాదాల చెంత బంగారు యంత్రానికి రూ. 5, 121 నగదును కమిటీ సభ్యులకు అందజేశారు.

సమస్యలు పరిష్కరించేందుకే రీ సర్వే

సీఎస్‌పురం: భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రీ సర్వే నిర్వహిస్తుందని డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని బోడావులదిన్నె రెవెన్యూలో జరుగుతున్న రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలను వీఆర్వోలకు అందించి రీ సర్వే త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకరించాలని ఆయన కోరారు. వీఆర్వో శివశంకర్, సింగిల్‌విండో డైరెక్టర్ వాడా లక్ష్మీరెడ్డి, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

హనుమంతునిపాడు: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

అవాస్తవాలు ప్రచారం చేయడం సరైంది కాదు



తొక్కిసలాట జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కొమ్మినేని

● ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

కందుకూరు: కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలు వక్రీకరిస్తూ అసత్యాలను ప్రచారం చేయడం సరైంది కాదని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల చంద్రబాబునాయుడు బహిరంగ సభ సందర్భంగా జరిగిన జరిగిన తొక్కిసలాట ప్రదేశాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. తొక్కిసలాట ఘటన జరగడానికి కారణాలను సీఐ వెంకట్రావ్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసుల వైఫల్యం వల్ల దుర్ఘటన జరిగినట్లు కొన్ని మీడియాల్లో వార్తలు రావడం సమంజసం కాదన్నారు. పోలీసుల వైఫల్యం వల్ల జరిగితే ఏ విధంగా పోలీసులు వైఫల్యం చెందారో స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వాస్తవాలను వక్రీకరించి వార్తలు ప్రచురించడం సరైంది కాదన్నారు. ఇరుకురోడ్లు, డ్రోన్‌షాట్స్ కోసం చేసిన చేసిన ప్రయత్నం వల్లే దుర్ఘటన జరిగినట్లు తనకు తెలిసిందన్నారు. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడంలో తప్పు లేదు కాని దుర్ఘటనపై మానవత్వంతో ఆలోచించాలని, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలన్నారు. కొందరు పనిగట్టుకుని అసత్య వార్తలు రాయడం ద్వారా సమాజ విధ్వంసానికి ప్రయత్నించడం మంచిది కాదని, జర్నలిజం వృత్తికి శ్రేయస్కరం కాదని సూచించారు.

మోటార్లు చోరీ



కారుమంచిలో మోటార్లు చోరీ చేసిన ప్రాంతం

టంగుటూరు: రక్షిత మంచినీటి పైపులైను మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కారుమంచి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకుకు చెరువు నుంచి నీరందించి గ్రామ ప్రజలకు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో పంచాయతీ సిబ్బంది శుక్రవారం తెల్లవారుజామున నీటిని పంపిణీ చేసేందుకు ఒక మోటారు వద్దకు రాగా కనిపించలేదు. అక్కడి నుంచి మరో మోటారు నుంచి నీరందించడానికి వెళ్లగా అది కూడా అదృశ్యమైంది. దీంతో రెండు మోటార్లు చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని గ్రామ సర్పంచ్ మన్నం శ్రీనివాసుకు, సచివాలయ కార్యదర్శి రామకృష్ణకు సమాచారం అందించారు. చోరీకి గురైన మోటార్ల విలువ రూ.లక్ష ఉంటుందని పంచాయతీ కార్యదర్శి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు.